# ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సన్నాహాలు

- జిల్లాలో ఖాళీగా ఉన్నవి 600, అందులో ఎస్జీటీ 500 పైనే, మరోవంద స్కూల్ అసిస్టెంట్ పోస్టులు
- త్వరలో డీఎస్సీ - 2020 ద్వారా భర్తీ

**ఆంధ్రజ్యోతి -మచిలీపట్నం:**
జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలు పంపాలని ప్రభుత్వం డీఈవోను కోరింది. దీంతో జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను డీఈవో కార్యాలయం నుంచి ఇప్పటికే ప్రభుత్వానికి పంపారు. అన్ని కేటగిరీల్లో కలిపి 600 పోస్టులు పైగా ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు లెక్కతేల్చారు. వీటిలో 500కు పైగా సెకండరీ గ్రేడ్ టీచర్, మరో వంద స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయని డీఈవో ఎంవీ రాజ్యలక్ష్మి తెలిపారు.

## ఈ నెలాఖరుకు నోటిఫికేషన్?

ఫిబ్రవరి నెలాఖరు నాటికి డీఎస్సీ-2020 నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. తొలుత టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే నేటివరకు దానికి సంబంధించిన ప్రకటన విడుదల కాలేదు. టెట్ ప్రకటన కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పినా అందుకు అనుగుణంగా ఇంకా అడుగులు వేయలేదు. కొద్దిరోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అవుతుందనే ఆశతో నిరుద్యోగులు ఉన్నారు. డీఎస్సీ - 2018 పోస్టుల భర్తీ అంశం కోర్టులో ఉండడంతో అర్హత సాధించిన వారిని పూర్తిస్థాయిలో నియమించేందుకు అవకాశం లేకుండా పోయింది.

## ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీలపై వివరాల సేకరణ

జిల్లాలో 2004వ సంవత్సరం నుంచి ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు. ఇదివరకు 850 ఎయిడెడ్ పాఠశాలలు ఉండేవి. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం, కాలక్రమేణా ఆ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడంతో బోధించేవారు లేక 600కు పైగా పాఠశాలలు మూతబడ్డాయి. మిగిలిన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచరు పోస్టుల వివరాలను పంపాలని ప్రభుత్వం డీఈవో కార్యాలయ అధికారులను ఆదేశించింది. ఈ వివరాలు సేకరిస్తున్నామని, ఒకటీ రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక పంపుతామని డీఈవో తెలిపారు.

FREEJOBALERT.COM No.01 Website for Govt Jobs